సాక్షి ప్రకాశం

సోమవారం । 12 । మే । 2025



అమ్మో పెద్దపులి

మార్కాపురం డివిజన్‌లో అటవీ సమీప గ్రామాల్లో పెద్దపులి సంచారంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

- 8లో..



హామీలు విస్మరించడం చంద్రబాబు నైజం

చంద్రబాబు ఇచ్చిన హామీలు విస్మరించారని మాజీ మంత్రి సురేష్ విమర్శించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
43 /29

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

వ్యవసాయం కరువు!

కూటమి ప్రభుత్వంలో రైతులకు ప్రభుత్వ భరోసా ఏమాత్రం దక్కడం లేదు. ప్రభుత్వం ఏర్పాటై 11 నెలలు దాటినా రైతుల ఖాతాల్లో రూపాయి కూడా జమకాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఖరీఫ్, రబీ సీజన్లు దాటిపోయాయి. మరో 20 రోజుల్లో మళ్లీ ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. గత నెలలో జిల్లాలో 17 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారు. అయితే ఇంత వరకూ సాయం మాత్రం అందలేదు. ప్రకృతి వైపరీత్యాలతో దిగుబడులు రాక, వ్యాపారుల మాయాజాలంతో గిట్టుబాటు ధరలు దక్కక తీవ్రంగా నష్టపోయిన రైతులు బాధలు దిగమింగి మళ్లీ సాగుకు సమాయత్తమయ్యారు.

- రైతులకు దక్కని ప్రభుత్వ భరోసా
- కరువు సాయం నిల్
- ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న రైతన్నలు
- అన్నదాత సుఖీభవ అమలు ఎప్పుడో..?
- వేసవి దుక్కులు ప్రారంభించిన రైతులు



వేసవి దుక్కులు దున్నుతున్న రైతు

గత ఏడాది ఖరీఫ్ సాగు లక్ష్యం 2,02,249 హెక్టార్లు

సాగు చేసింది: 1.65 లక్షల హెక్టార్లు

వైఎస్సార్ సీపీ హయాంలో జిల్లాలో రైతులకు అందిన సాయం: రూ. 1634.85 కోట్లు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జిల్లాలో రైతులకు అందిన సాయం ఇలా..

సంవత్సరం	రైతులు	మంజూరైన నగదు (రూ.కోట్లలో)
2019–20	2,30,453	311.11
2020–21	2,61,600	353.24
2021–22	2,74,790	370.97
2022–23	2,86,256	386.45
2023–24	2,84,113	213.08
మొత్తం	13,37,212	1634.85

మార్కాపురం:

జిల్లాలో గత ఏడాది ఖరీఫ్‌లో 2,02,249 హెక్టార్లు సాగుచేయాల్సి ఉండగా సుమారు 1.65 లక్షల హెక్టార్లలో పంటలు సాగు చేశారు. ఈ ఏడాది కూడా అంతే విస్తీర్ణంలో సాగయ్యే అవకాశం ఉంది. గతేడాది ప్రధానంగా ఖరీఫ్ సీజన్‌లో వరి 9,487.04 ఎకరాల్లో, జొన్న 83.347, సజ్జ 6449.88, మొక్కజొన్న 3838.35, రాగి 13, కొర్రలు 2370.5, పెసర 306.8, మినుము 508.85, కంది 70963.33, పత్తి 12239.92, పొగాకు 5867.78, అలసందలు 13.13 ఎకరాల్లో సాగైంది.

అయితే గత ఏడాది రెండు సీజన్లలో పంటలు నష్టపోయినా ప్రభుత్వ సాయం దక్కలేదు. ఈ ఏడాది ఏప్రిల్‌లో రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించింది. అధికారులు ప్రతిపాదనలు పంపినా ఇంత వరకూ కరువుసాయం అందలేదు.

జిల్లాలో కరువు మండలాలు ఇవీ...

జిల్లాలో పుల్లలచెరువు, దొనకొండ, కురిచేడు, మర్రిపూడి, కంభం, తర్లుపాడు, పెద్దారవీడు, సంతనూతలపాడు, ఒంగోలు, వెలిగండ్ల, బేస్తవారిపేట మండలాల్లో తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడినట్లు ప్రభుత్వం గుర్తించింది. కొనకనమిట్ల, మార్కాపురం, చీమకుర్తి, సీఎస్‌పురం, పామూరు, రాచర్ల మండలాల్లో ఓ మోస్తరు కరువు ఉన్నట్లు గుర్తించింది. గతేడాది డిసెంబర్ నుంచి వర్షాలు లేకపోవడంతో రబీలో సాగు చేసిన పంటలు ఎండిపోయాయి. దీంతో రైతులు దిగుబడులు లేక, పెట్టిన పెట్టుబడులు రాక నష్టపోయారు.

కరువు బృందం వచ్చినా దక్కని సాయం...

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గత ఏడాది జూన్ 20న కేంద్ర కరువు బృందం మార్కాపురం ప్రాంతంలో పర్యటించింది. ముందుగా వేముల కోట చెరువును పరిశీలించి అక్కడి రైతులతో మాట్లాడి పంట నష్టాన్ని అంచనా వేసి నివేదిక పంపారు. అయితే పరిహారం మాత్రం రాలేదు. ఇలా సీజన్లు దాటిపోయినా రైతులకు పంట నష్టపరిహారం అందలేదు. దీంతో రైతులు నిరాశ, నిస్పృహల్లో ఉన్నారు.

నష్టాల బాధ దిగమింగి మళ్లీ సాగుకు సమాయత్తం..

ఖరీఫ్‌లో రైతులు ఎక్కువగా కంది, వరి, సజ్జ, మొక్కజొన్న, కొర్రలు తదితర పంటలు సాగు చేస్తారు. తక్కువ మొత్తంలో అంటే వేరుశనగ 397.22, నువ్వులు 3878.17, ఆముదం 1034.53 ఎకరాలు, మిర్చి 21903.32 ఎకరాల్లో సాగు చేస్తారు. రైతులు ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పొలాల్లో వేసవి దుక్కులు ప్రారంభించారు. తొలకరి జల్లులు పడితే పంటలు సాగు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఏ ఒక్క రైతుకు ఒక్క రూపాయి కూడా ఆర్థికసాయం అందించలేదు. రెండు సీజన్లలో ప్రకృతి వైపరీత్యాలతో రైతులు నష్టపోయారు. దీంతోపాటు మిర్చిసాగు చేసిన రైతులు గిట్టుబాటు ధర లేక నష్టపోయారు. క్వింటా మిర్చి రూ.8 వేలకు కూడా కొనలేని పరిస్థితి ఏర్పడింది. నష్టాల బాధలను దిగమింగి మళ్లీ రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు. పెట్టుబడుల కోసం 2019కు పూర్వం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించినట్లుగా ఇప్పుడు కూడా పెట్టుబడి సాయం కోసం వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్తున్నారు. ఈ ఏడాది కేవలం పీఎం కిసాన్‌నిధి కింద మాత్రమే రైతులకు రూ.2 వేల నగదు జమైంది.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతన్నకు చేయూత

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వ్యవసాయం పండుగలా సాగింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు సాగు చేసుకునే రైతులు పెట్టుబడి సాయం కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించకుండా ఏటా పీఎం కిసాన్ నిధితో కలిపి వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.13,500 అందించడంతో రైతులు ఇబ్బంది పడకుండా ఖరీఫ్ సీజన్లలో పత్తి, మిర్చి, పొగాకు, కంది, సజ్జ, వరి తదితర పంటలు సాగుచేసుకున్నారు. నాటి ప్రభుత్వం జిల్లాలో మొత్తం 616 రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసింది. రైతు భరోసా ఆర్థిక సాయంతో పాటు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర పథకాలన్నీ అమలు చేయడంతో ఐదేళ్లపాటు రైతులు ఇబ్బందులు లేకుండా పంటలు పండించుకున్నారు.

కరువు సాయం అందించాలి



జిల్లాలో ఇప్పటికే కరువు తీవ్రంగా ఉంది. పశ్చిమ ప్రకాశంలో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కరువు మండలాలుగా ప్రకటించిన ప్రాంతాల్లో రైతులకు సాయం చేయడంతోపాటు రుణాల రీషెడ్యూల్ చేయాలి. సబ్సిడీపై ఎరువులు, పురుగుమందులు అందించాలి. ప్రభుత్వం రైతులను ఆదుకుంటేనే వ్యవసాయం చేసే పరిస్థితి ఏర్పడింది.

– గాలి వెంకటరామిరెడ్డి, రైతు సంఘం జిల్లా నాయకులు, మార్కాపురం

న్యూస్‌రీల్

18 నుంచి తెలుగు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు

కంభం:

మండలంలోని రావిపాడు గ్రామంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు తెలుగు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాల్గవ బహుమతుల కింద రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. మ్యాచ్‌లు సాయంత్రం 4 గంటల నుంచి సింథటిక్ మ్యాట్‌పై ఫ్లడ్‌లైట్ల వెలుగులో జరుగుతాయన్నారు. పాల్గొనదలచిన జట్లు రూ.500 సభ్యత్వ రుసుము చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 818485524, 7036064032 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఇద్దరు తహసీల్దార్ల బదిలీ

- ఇద్దరికి పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు

ఒంగోలు సబర్బన్:

జిల్లాలో ఇద్దరు తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఉత్తర్వులు జారీ చేశారు. అదే విధంగా ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా పదోన్నతి కల్పించారు. ఒంగోలు అర్బన్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న నేలభట్ల వాసును వెలిగండ్ల బదిలీ చేశారు. కొత్తపట్నం తహసీల్దార్‌గా పనిచేస్తున్న పిన్నిక మధుసూదన్ రావును ఒంగోలు అర్బన్ తహసీల్దార్‌గా నియమించారు. మధుసూదన్‌రావు కొత్తపట్నం తహసీల్దార్ ఇన్‌చార్జ్‌గా ఎఫ్‌ఏసీలో విధులు నిర్వహిస్తారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వలేటివారిపాలెం డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎస్‌కే నాయబ్ రసూల్‌కు పదోన్నతి కల్పించి ఒంగోలు రూరల్ తహసీల్దార్‌గా బదిలీ చేశారు. ఒంగోలు రూరల్‌లో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎస్.శ్రీనివాసరావుకు పదోన్నతి కల్పించి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వలేటివారిపాలెం తహసీల్దార్‌గా నియమించారు. గిద్దలూరు తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎం.ఆంజనేయరెడ్డి మెడికల్ లీవులో వెళ్లారు. ఆ స్థానంలో అక్కడే పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్‌కు ఎఫ్‌ఏసీ ఇచ్చి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా నియమించారు. అదేవిధంగా సీఎస్‌పురంలో పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్‌కు ఎఫ్‌ఏసీ ఇచ్చి అక్కడే ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు డీఆర్‌సీ సమావేశం

- మీ కోసం కార్యక్రమం రేపటికి మార్పు

ఒంగోలు సబర్బన్: జిల్లా రివ్యూ కమిటీ మీటింగ్ (డీఆర్‌సీ) సోమవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. డీఆర్‌సీ సమావేశం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రకాశం భవన్‌లోని మీ కోసం ఎసమావేశ మందిరంలో డీఆర్‌సీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం జరగాల్సిన 'మీకోసం' కార్యక్రమాన్ని రద్దు చేసి మంగళవారానికి మార్చామన్నారు. జిల్లాలోని ప్రజలందరూ ఈ మార్పును గమనించాలని కోరారు.

డీసీసీబీ చైర్మన్‌గా డాక్టర్ సీతారామయ్య

- డీసీఎంఎస్ చైర్మన్‌గా కసిరెడ్డి శ్యామల

ఒంగోలు సబర్బన్: డిస్ట్రిక్ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ (డీసీసీబీ) చైర్మన్‌గా ఒంగోలుకు చెందిన టీడీపీ నేత డాక్టర్ కామేపల్లి సీతారామయ్యను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా డిస్ట్రిక్ కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్‌గా టీడీపీకి చెందిన కసిరెడ్డి శ్యామలను నియమిస్తూ కూడా ఉత్తర్వులు జారీ చేసింది. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ఈ రెండు పదవులు ఖాళీగానే ఉన్నాయి. ఈ రెండు పదవులకు టీడీపీతో పాటు, కూటమి పార్టీ నేతలు అనేక మంది పోటీ పడ్డారు. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం ఈ రెండు పదవులను పూరించింది.

జనసేన రియాజ్‌కు లైవ్‌స్టాక్ పదవి

ఒంగోలు టౌన్: కూటమి ప్రభుత్వం ఆదివారం మరికొన్ని నామినేటెడ్ పదవులను ప్రకటించింది. అందులో జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్‌కు లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ పదవి దక్కింది.

పబ్లిక్, ప్రైవేట్ ఎస్టాబ్లిష్‌మెంట్లు రిటర్న్‌లు సమర్పించాలి

ఒంగోలు వన్‌టౌన్: ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పబ్లిక్, ప్రైవేట్ ఎస్టాబ్లిష్‌మెంట్లు ఎంప్లాయిమెంట్ రిటర్న్‌లు సమర్పించాలని జిల్లా ఉపాధి కార్యాలయం అధికారి టీ భరద్వాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి మూడు నెలలకు మార్చి, జూన్, సెప్టెంబర్‌తో పాటు డిసెంబర్‌లో ఒకసారి ఆన్‌లైన్ ద్వారా తమ ప్రతిపాదనలను పంపాలన్నారు. నూతన ఎస్టాబ్లిష్‌మెంట్‌లు 10 మంది కంటే ఎక్కువ ఉద్యోగులు ఉంటే తప్పని సరిగా ఎంప్లాయిమెంట్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఇతర పూర్తి వివరాలకు ఒంగోలులోని జిల్లా ఉపాధి కార్యాలయంలో సంప్రదించాలన్నారు. 08592 281776 అనే నంబరులో సంప్రదించవచ్చన్నారు.

ఆడించే వారేరీ..!

- జూనియర్ కాలేజీల్లో పీడీ పోస్టులకు మంగళం
- రిటైర్డు అయిన పీడీల పోస్టులు భర్తీ చేయని ప్రభుత్వం
- పీడీ పోస్టులను సబ్జెక్టు అధ్యాపకుడిగా మార్చిన వైనం
- ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 33 కళాశాలలకుగాను ఉన్నది ఇద్దరు పీడీలే
- ప్రభుత్వ నిర్ణయాలతో ఇంటర్ విద్యార్థులకు అందని వ్యాయామ విద్య



కంభంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆట స్థలం

ఒంగోలు సిటీ: ఏ విద్యార్థి అయినా మానసికంగా బాగుండాలంటే శారీరకంగా దృఢంగా ఉండాలి. ఇందులో భాగంగా పాఠశాల స్థాయి నుంచి పిల్లలకు శారీరక వ్యాయామం కల్పించేందుకు ఆటలు ఏర్పాటు చేశారు. అందుకు ప్రతి ఉన్నత పాఠశాలకు పీఈటీ, కళాశాలలకు పీడీలను ఏర్పాటు చేశారు. కాలక్రమేణా ఎందరో విద్యార్థులు క్రీడాకారులుగా రాణించి దేశానికి పేరు తెచ్చారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక డీఎస్సీలో పీడీ పోస్టులకు మంగళం పాడింది.

ఒక పక్క ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు మెగా డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా కింద పోస్టులకు ఎంపిక చేసింది. ప్రత్యేకంగా క్రీడల్లో ప్రతిభ, సీనియారిటీ ద్వారా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు ఇస్తుంది. ఇది కేవలం 6 నుంచి 10వ తరగతి పాఠశాలల్లోనే. కానీ ఇంటర్మీడియెట్ కళాశాలలకు మాత్రం పీడీ పోస్టులను భర్తీ చేయకపోవడం, భర్తీ చేయని పోస్టులను కూడా అధ్యాపకుల పోస్టుల కింద మార్చి అసలు కళాశాలల్లో పీడీ పోస్టులే లేకుండా కూటమి ప్రభుత్వం చేస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పీడీలు లేక ఆటలకు దూరం..

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 33 కళాశాలలు ఉన్నాయి. ఇందులో 20 కళాశాలల్లో పీడీ పోస్టులు ఉండగా ఇప్పటికే 18 మంది ఉద్యోగ విమరణ పొందారు. మద్దిపాడు, సింగరాయకొండ మండలాల్లోని కళాశాలల్లో మాత్రమే పీడీలు ఉన్నారు. వీరు కూడా త్వరలో ఉద్యోగ విరమణ పొందుతున్నట్లు సమాచారం.

పోస్టు కన్వర్ట్ ఇలా..

జూనియర్ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్ (పీడీ)గా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందితే ఆ కళాశాలలో ఇక పీడీ పోస్టును భర్తీ చేయకపోగా, ఆ పోస్టులను అదే కళాశాల లేదా, పక్క మండలాల్లోనే కళాశాలల్లో సబ్జెక్టు అధ్యాపకుడిగా కన్వర్ట్ చేసి పోస్టులను అక్కడ భర్తీ చేస్తున్నారు. కందుకూరు టీఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీడీగా గత నెలలో ఉద్యోగ విరమణ పొందాడు. ఆ పోస్టును తాళ్లూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సబ్జెక్టు అధ్యాపకుడిగా కన్వర్ట్ చేశారు. ఇక టీఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీడీ పోస్టు ఉండదు. విశాలమైన క్రీడా మైదానం ఉన్నప్పటికీ పీడీ పోస్టులను కన్వర్ట్ చేసి పోస్టును తగ్గించుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ప్రకాశం జిల్లాలో 18 పీడీ పోస్టులు సబ్జెక్టు అధ్యాపకులుగా కన్వర్ట్ చేశారు. తిరిగి ఆయా కళాశాలలకు పీడీ పోస్టులు ఇచ్చే ఉద్దేశంలో ప్రభుత్వం లేదు. అందుకే ఉన్న పోస్టులను పక్కదారి మళ్లించి జీతాల ఖర్చును తగ్గించుకునే పనిలో పడింది. దీంతో జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులు వ్యాయామ విద్యకు దూరమైనట్లే.

వ్యాయామ విద్యా అందని ద్రాక్షేనా..

ఉన్నత పాఠశాలల్లో పీఈటీ, పీడీ పోస్టులు ఉన్నాయి. పాఠశాల స్థాయిలో విద్యార్థులు క్రీడల్లో రాణిస్తున్నారు. తిరిగి డిగ్రీ కళాశాలల్లో కూడా పీడీ పోస్టులు ఉన్నాయి. కానీ మధ్యలో ఇంటర్ కళాశాలల్లో పీడీ పోస్టులు లేనందు వల్ల విద్యార్థులు క్రీడల్లో రాణించలేకపోతున్నారు. క్రీడా మైదానాలు ఉన్న జూనియర్ కళాశాలల్లోనే పీడీ పోస్టులు ఉండేవి. అవి కూడా ప్రస్తుతం లేకుండా చేస్తున్నారు. ఇంటర్ చదివే విద్యార్థులకు వ్యాయామ విద్యా అందని ద్రాక్షలానే కనిపిస్తోంది.

రెడ్‌బుక్ రాజ్యాంగానికి బెదరం

- అక్రమ కేసులతో భయపెట్టాలని చూస్తున్న ప్రభుత్వం
- మాజీ మంత్రి విడదల రజినిపై పోలీసుల తీరు సరికాదు
- రైతులు ఆత్మహత్య చేసుకున్నా పట్టించుకోని గుడ్డి ప్రభుత్వం
- గిట్టుబాటు ధర లభించక ఆత్మహత్యలే శరణ్యం అంటున్న రైతులు
- వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు



మాట్లాడుతున్న ఒంగోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు, పక్కన పార్టీ నేతలు

ఒంగోలు సిటీ:

రెడ్‌బుక్ రాజ్యాంగంతో వైఎస్సార్ సీపీ శ్రేణులను అక్రమ కేసులతో భయపెట్టాలని కూటమి ప్రభుత్వం కలలుగంటోందని, మీరు పెట్టే కేసులకు అదరం.. బెదరం అని ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు అన్నారు. నగరంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. బెదరగొట్టాలని చూస్తే అంతే రెట్టింపు వేగంతో ముందుకెళతామని, ఎవరూ భయపడే ప్రసక్తి లేదని ప్రభుత్వం గుర్తుంచుకోవాలన్నారు. ఒక బీసీ మహిళ, మాజీ మంత్రి అని కూడా చూడకుండా విడదల రజినిపై చిలకలూరిపేటలో పోలీసులు వ్యవహరించిన తీరు సరికాదని మండిపడ్డారు. ఈ ప్రభుత్వానికి మహిళలంటే కనీస గౌరవం కూడా లేదని విమర్శించారు. వైఎస్సార్ సీపీకి చెందిన మహిళా ఎంపీటీసీ పై కేసుపెట్టి అర్ధరాత్రి నైటీపై ఉన్న ఆమెను పోలీసులు లాక్కెళ్లడం సరికాదన్నారు. తమ పదినెలల పరిపాలనలో వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ప్రభుత్వం ఇలా అరాచకంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు.

రైతుల కన్నీటి ఘోష పట్టని ప్రభుత్వం:

రైతులు గిట్టుబాటు ధరల కోసం రోడ్డెక్కుతోంటే ప్రభుత్వానికి కనీస చలనం లేకపోవడం శోచనీయమని చుండూరి రవిబాబు అన్నారు. మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. ఇప్పటికే పొరుగు జిల్లా పర్చూరులో పొగాకు రైతు ఆత్మహత్య చేసుకున్నాడని, మద్దతు ధరలేక మిర్చిరైతులు ఆత్మహత్యలే శరణ్యమని ఆందోళన చెందుతున్నారన్నారు. రైతుల కన్నీటి ఘోష ఈ ప్రభుత్వానికి పట్టకపోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో ప్రజలకు కొనుగోలు శక్తి తగ్గిపోయిందన్నారు. ఫలితంగా ఉద్యోగులు, వ్యాపారులు, రైతులు, అన్ని వర్గాల వారు అవస్థలు పడుతున్నారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు అండగా నిలిచిందని, ఆర్‌బీకేల ద్వారా అన్ని రకాల సేవలను అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రకృతి విపత్తులతో నష్టపోయిన రైతులను సకాలంలో పరిహారం అందించి అండగా నిలిచిందన్నారు.

మహిళా నేతలపై అసభ్యకర పోస్టులపై చర్యలేవీ..

నిత్యం ప్రజల్లో ఉంటున్న మాజీ మంత్రి, మహిళా నాయకురాలు రజని పట్ల ప్రభుత్వం వ్యవహరించిన తీరు సరికాదని పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ మండిపడ్డారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే మహిళలంతా రోడ్డెక్కుతారని ఆమె హెచ్చరించారు. తప్పుడు కేసులతో భయపెట్టాలని చూడడం సరికాదన్నారు. వైఎస్సార్ సీపీ నేతలు, మహిళా నేతలపై సోషల్ మీడియాల్లో అసభ్యకరమైన పోస్టులు పెడుతున్నా వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రభుత్వాన్ని నిలదీశారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళా మంత్రిపై సీఐ దురుసుగా ప్రవర్తించడం, సీపై కూడా కేసులు పెడతామంటూ బెదిరించడం సరికాదని పార్టీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల వ్యవస్థకు మచ్చ తెచ్చేలా సీఐ వ్యవహరించారని మండిపడ్డారు. సమావేశంలో హనుమంతునిపాడు ఎంపీపీ గాయం సావిత్రి, మహిళా నాయకులు భూమిరెడ్డి రమణమ్మ, బడుగు ఇందిర, గోనుగుంట రజనీ, పేరంప్రసన్న, మేరీకుమారి, లక్ష్మీకాంతం, జ్యోతి, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.కోటియాదవ్, ఫణిదపు సుధాకర్, వేముల శ్రీకాంత్, పీటర్, పలువురు అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు కేసులతో డైవర్షన్ రాజకీయాలు

ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ వారిపై కేసులు పెడుతూ ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని రవిబాబు ఆరోపించారు. మా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పక్కన ఉన్నవారిపై తప్పుడు కేసులు బనాయించి వేధింపులకు గురిచేయడం సరికాదన్నారు. తమకు అనుకూల మీడియాలో తప్పుడు కథనాలు రాయిస్తూ ఆధారాలు చూపకుండా నిందలు వేస్తూ దిగజారుడుతనాన్ని ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. సూపర్‌సిక్స్ అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాజధాని నిర్మాణం పేరుతో కేంద్రం నుంచి నిధులు తెచ్చి వాటిని కమీషన్లతో పంచుకుని దోచేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో పరిశ్రమలు మూతపడుతున్నాయని, చిరుద్యోగులు రోడ్డున పడుతున్నారని, మెగా డీఎస్సీ అని దగా చేస్తోందని విమర్శించారు.

వీరయ్య కేసులో నాన్చివేత ధోరణి

- రోజులు గడుస్తున్నా కేసు ఫైనల్ కాని వైనం

ఒంగోలు టౌన్: టీడీపీ నాయకుడు వీరయ్య చౌదరి హత్య కేసు ఫైనల్ కావడానికి మరికొద్ది రోజులు ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రధాన సూత్రధారుల్లో ఒకరు, ముగ్గురు పాత్రధారులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. మిగిలింది మరో ముఖ్య సూత్రధారుడిగా అనుమానిస్తున్న హవాలా వ్యాపారి మాత్రమేనని చెబుతున్నారు. దాదాపుగా విచారణ కూడా పూర్తయినట్లు పోలీసు వర్గాలు చెప్పుకుంటున్నాయి. ఎస్పీ ఏఆర్ దామోదర్, విచారణాధికారిగా ఉన్న ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావుతో కలిసి శనివారం గుంటూరులోని ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠికి వీరయ్య చౌదరి హత్య కేసుకు సంబంధించిన వివరాలను అందజేసినట్లు చెబుతున్నారు. హత్య జరిగిన తీరుతెన్నులను, హత్యానంతరం విచారణ పూర్తి వివరాలను ఐజీ అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. దాంతో ఆదివారం ఈ కేసు ఫైనల్ అవుతుందని అంతా భావించారు. కానీ కోర్టు పనుల మీద ఎస్పీ దామోదర్ వైజాగ్ వెళ్లినట్లు తెలుస్తోంది. సోమ, మంగళవారాలు కూడా ఆయన వైజాగ్‌లోనే ఉంటారని సమాచారం. తిరిగి బుధవారం ఆయన ఒంగోలుకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అంటే మరో మూడు నాలుగు రోజుల పాటు వీరయ్య చౌదరి కేసు ఫైనల్ అయ్యే అవకాశాలు లేవనే చెప్పాలి.

క్లుప్తంగా

ద్విచక్రవాహనం అదుపు తప్పి యువకుడు మృతి



ద్విచక్రవాహన ప్రమాదంలో మృతిచెందిన గురువర్ధన్

దర్శి(కురిచేడు): మండలంలోని లంకోజనపల్లి సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం జరిగింది. వివరాలలోకి వెళితే..కట్ట సింగన్నపాలెం గ్రామానికి చెందిన కల్లూరి గురువర్ధన్ (16) కుటుంబం గుంటూరులో నివసిస్తుంది. తండ్రి బేల్దారి పనులు చేస్తుంటాడు. పదో తరగతి చదివిన గురువర్ధన్ స్వగ్రామంలో బంధువుల ఇళ్లలో జరిగే దశదిన కర్మ కార్యక్రమానికి ద్విచక్రవాహనంపై దర్శి నుంచి బయలుదేరి వెళుతున్నాడు. నాగార్జున సాగర్ కాలువ -లంకోజన పల్లి గ్రామాల మధ్యలో ద్విచక్రవాహనం అదుపు తప్పి పక్కన పొలాల్లో ఉన్న చెట్టుకు ఢీకొట్టింది. ప్రమాదంలో గురువర్ధన్ తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో వాహనం పూర్తిగా దెబ్బతింది. దారిన వెళ్లే ప్రయాణికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డ్ మృతి



మృతుడు శ్రీరాములు(ఫైల్)

యర్రగొండపాలెం: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డ్ వై.శ్రీరాములు(37) రోడ్డు ప్రమాదంలో ఆదివారం మృతి చెందాడు. ఆయన శనివారం డ్యూటీ ముగించుకొని రాత్రి 7.45గంటలకు తన స్వగ్రామమైన వాదంపల్లికి మోటారు బైక్ వెళ్తున్న సమయంలో జాతీయ రహదారిపై ఉన్న గోళ్లవిడిపి అడ్డ రోడ్డు వద్ద అడవి పంది ఢీకొంది. ఈ సంఘటనలో బైక్ అదుపు తప్పి బోల్తాపడింది. కిందపడిన శ్రీరాములుకు తీవ్రంగా గాయాలయ్యాయి. బైక్‌తో పాటు హెల్మెట్ రోడ్డుపై పడి ఉండటాన్ని గమనించిన గుర్తు తెలియని వ్యక్తి 108 వాహనానికి సమాచారం ఇచ్చాడు. వెంటనే గాయాలతో ఉన్న అతన్ని ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.చౌడయ్య తెలిపారు.

వేములకోటలో చోరీ

- రూ.1.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.43 వేల నగదు చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం సిబ్బంది, పక్కన ఎస్సై అంకమరావు

మార్కాపురం: మండలంలోని వేములకోట గ్రామంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఈ మేరకు ఆదివారం ఉదయం మార్కాపురం రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. వివరాల్లోకి వెళితే..రజకబజారులో నివాసముండే కనిగిరి అల్లూరయ్య రెండు రోజుల క్రితం కుటుంబసభ్యులతో కలిసి ఊరికి వెళ్లాడు. శనివారం రాత్రి ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో సామాన్లు చిందరవందరగా పడి ఉండటాన్ని గమనించి దొంగతనం జరిగినట్లు గుర్తించాడు. బాత్‌రూమ్ కిటికీ పగులకొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న రూ.1.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.43 వేల నగదు చోరీకి గురైనట్లు అల్లూరయ్య ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై అంకమరావు తెలిపారు. సంఘటనా స్థలంలో క్లూస్‌టీం ఆధారాలు సేకరించారు.

అమ్మో పెద్ద పులి..

- నెల రోజుల వ్యవధిలో 4 గేదెలు, ఎద్దులపై పెద్ద పులి దాడి
- ఆందోళనలో అటవీ సమీప గ్రామాల ప్రజలు
- ఒంటరిగా అడవుల్లోకి వెళ్లవద్దంటున్న అటవీ శాఖాధికారులు

మార్కాపురం:

అటవీ సమీప గ్రామాల్లో పెద్దపులి సంచారం ప్రజల్లో, పశుపోషకులు, రైతుల్లో వణుకు పట్టిస్తోంది. మార్కాపురం, పెద్దారవీడు, అర్ధవీడు మండలాల్లోని అటవీసమీప గ్రామాల్లో నెల రోజుల వ్యవధిలో పెద్దపులి 4 గెదెలు, ఎద్దులను చంపింది. దీంతో పశువులను మేపుకునేందుకు పశువుల కాపరులు, పొలాలకు వెళ్లేందుకు రైతులు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రిపూట బిక్కుబిక్కు మంటూ కాలంగడుపుతున్నారు. పీ139 పెద్దపులి (మగ పులి) ఈ ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు అటవీ అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా మార్కాపురం మండలం గొట్టిపడియ, అక్కచెరువుతాండ, పెద్దారవీడు మండలం కలనూతల, సుంకేసుల, గుండంచర్ల, అర్ధవీడు మండలం మిట్టమీదిపల్లి, కొత్తూరు, అయ్యవారిపల్లి, వీరభద్రాపురం, బొల్లుపల్లి గ్రామాల్లో పెద్దపులి సంచారాన్ని గ్రామస్తులు కనుగొన్నారు.

☛ ఏప్రిల్ 30న మాగుటూరు తండాలో పెద్దపులి గేదెను చంపింది. ఏప్రిల్ 10న పెద్దారవీడు మండలం కలనూతలలో గేదెపై పులి దాడి చేసి చంపేసింది.

☛ ఈనెల 6వ తేదీన మార్కాపురం మండలం గొట్టిపడియ గ్రామ శివార్లలో వెంకటేశ్వరరెడ్డికి చెందిన గేదెను పెద్దపులి చంపింది.

☛ ఈనెల 10వ తేదీన అర్ధవీడు మండలం బొల్లుపల్లికి చెందిన నాగేశ్వరరావు తన ఎద్దులను కొట్టంలో కట్టి వేశారు. పెద్దపులి ఎద్దుపై దాడిచేసి చంపి అడవిలోనికి లాక్కెళ్లింది.

☛ ఇలా నెలరోజుల వ్యవధిలో నాలుగు సంఘటనలు జరగడంతో రైతులు, ప్రజలు, పశుపోషకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గొట్టిపడియ సంఘటనలో పులి పాదముద్రలు సేకరించారు.



అటవీ అధికారులు సేకరించిన పులి పాదముద్రలు



పందిని చంపి తీసుకెళ్తున్న పెద్దపులి



పందిని చంపి తీసుకెళ్తున్న పెద్దపులి

ఒంటరిగా అడవుల్లోకి వెళ్లొద్దు:



పశువుల మేత కోసం ఒంటరిగా అడవుల్లోకి పశు పోషకులు, రైతులు వెళ్లవద్దు. గ్రామ మొదట్లోనే పశువులను మేపుకోండి. గొట్టిపడియలో పెద్దపులి దూడను చంపేసింది. వణ్యప్రాణులు, పులులు కనిపిస్తే మాకు సమాచారం అందించండి. వాటిని చంపే ప్రయత్నం చేయొద్దు. విద్యుత్ తీగలు, వలలు వేయవద్దు. అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. జనావాసాల్లోకి రాకుండా అటవీ ప్రాంతంలోని నీటి సౌకర్యం ఏర్పాటు చేశాం.

నాగరాజు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్, మార్కాపురం

ఆక్రమించేద్దాం..అడిగేదెవరు..!

- యథేచ్ఛగా పోరంబోకు భూముల ఆక్రమణ
- కొనుగోలు 64.8 ఎకరాలు..ఆక్రమించింది 50 ఎకరాలు
- ఫెన్సింగ్‌ను అడ్డుకున్న పశుపోషకులు, గ్రామస్తులు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు



వాగుపోరంబోకు భూమిని ఆక్రమించి సాగుచేసిన జామాయిల్



ఆక్రమంగా వేసిన ఫెన్సింగ్ రాళ్లను పడగొట్టిన పశు పోషకులు.

మర్రిపూడి: కూటమి ప్రభుత్వంలో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఖాళీ కనిపిస్తే కన్నేసి యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. పశువుల మేత, వాగు పోరంబోకు భూములను సైతం వదలడం లేదు. దీంతో మూగజీవాలు మేతకోసం తల్లడిల్లిపోతున్నాయి. తాజాగా పశువుల మేత పోరంబోకు భూములను ఆక్రమించేందుకు ప్రయత్నించగా..పశుపోషకులు అడ్డుకున్నారు. దీంతో అక్రమార్కులు, పశుపోషకుల మధ్య వాగ్వాదంచోటుచేసుకుంది.

వివరాల్లోకి వెళితే.. కందుకూరు మండలం మాచవరం గ్రామానికి చెందిన గాదె శ్రీనివాసరెడ్డి, గాదె ప్రసన్నలక్ష్మీ, చిడిపూడి రమణారెడ్డిలు మండలంలోని సన్నమూరు రెవెన్యూ పరిధిలో సర్వేనంబర్ 52-2, 72-2, 51, 51-1, 66 లో సుమారు 64.80 ఎకరాల భూమిని కొనుగోలు చేసి సాగుచేసుకుంటున్నారు. అయితే ఆ భూమి పక్కనే సర్వే నంబర్ 51లో 32.08 ఎకరాలు, సర్వే నంబర్ 52-1లో ఎకరా పశువుల మేత పోరంబోకు భూమి ఉంది. అలాగే సర్వే నంబర్ 50-4 లో 16.74 ఎకరాలు, సర్వే నంబర్ 53లో 22.31 ఎకరాలు, సర్వే నంబర్ 71లో 13.64 ఎకరాల వాగు పోరంబోకు భూమి ఉంది. సుమారు 50 ఎకరాల ఈ పోరంబోకు భూమిని శ్రీనివాసరెడ్డి, ప్రసన్నలక్ష్మి, రమణారెడ్డి ఆక్రమించుకుని సుబాబుల్ పంటలను సాగు చేసుకోవడమేకాక యథేచ్ఛగా ఫెన్సింగ్‌రాళ్లు వేసి ఆక్రమించేస్తున్నారు. విషయం తెలుసుకున్న గ్రామంలోని పశుపోషకులు ఫెన్సింగ్‌ను అడ్డుకున్నారు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పశువుల పోరంబోకు భూమిలో ఉద్రిక్తవాతావరణం నెలకొంది. మేత పోరంబోకు భూములను ఆక్రమిస్తే మూగజీవాలను ఎక్కడ మేపుకోవాలని ఆక్రమణదారులను నిలదీశారు. అక్రమంగా వేస్తున్న ఫెన్సింగ్ రాళ్లను అదే గ్రామానికి చెందిన పశుపోషకులు అడ్డుకుని ఫెన్సింగ్‌రాళ్లను పడగొట్టారు. అయితే ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు మాకెందుకులే అన్న చందంగా మిన్నకుండటంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆక్రమణదారులపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పశుపోషకులు మండిపడుతున్నారు.

నాన్న ఆశయాలు కొనసాగిస్తాం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



బూచేపల్లి సుబ్బారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కుటుంబసభ్యులు, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

చీమకుర్తి: పేదల హృదయాల్లో చిరస్థాయిగా స్థానం సంపాదించుకున్న మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి ఆశయాలు కొనసాగిస్తామని ఆయన కుమారుడు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద రెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి 6వ వర్థంతి కార్యక్రమంలో బూచేపల్లి సుబ్బారెడ్డి సతీమణి జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కుటుంబసభ్యులు, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ తండ్రి అడుగుజాడల్లో నడుస్తానని, పేదల పక్షాన నిరంతరం పనిచేస్తానని తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ బూచేపల్లి ఛారిటబుల్ ట్రస్ట్ తరఫున క్రమం తప్పకుండా ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. తొలుత బూచేపల్లి పార్కులో ఉన్న బూచేపల్లి సుబ్బారెడ్డి స్మారకం వద్ద పూలమాలలు, పుష్పాలతో ఘనంగా నివాళులర్పించారు. కల్యాణమండపం వద్ద ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వెయ్యి మంది మహిళలకు చీరలను పంపిణీ చేశారు. బూచేపల్లి సుబ్బారెడ్డి వర్థంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమంలో చీమకుర్తి పట్టణంతో పాటుచుట్టు పక్కల గ్రామాల నుంచి దాదాపు 4 వేల మంది ప్రజలు పాల్గొన్నారు. యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న పాల్గొని బూచేపల్లి సుబ్బారెడ్డికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు బూచేపల్లి నందిని, ధనలక్ష్మి, బంధువులతో పాటు డాక్టర్ బి.జవహర్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నం శ్రీధర్ బాబు, పార్టీ మండల రూరల్ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ బాపతు వెంకటరెడ్డి, కౌన్సిలర్‌లు బీమన వెంకట్రావు, తప్పెట బాబూరావు, కంజుల ప్రతాప్‌రెడ్డి, సోమా శేషాద్రి, పాటిబండ్ల గంగయ్య, బడే అయ్యపరెడ్డి, ఆముదాలపల్లి రామబ్రహ్మం, తెల్లమేకల గాంధీ, కూరాకుల సుబ్బారెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పేదలకు చీరలను పంపిణీ చేస్తున్న దృశ్యం

పోలీసులా..కూటమి కార్యకర్తలా..?

- దర్శి టీడీపీ ఇన్‌చార్జి సేవలో పోలీసులు
- పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: దర్శి నియోజకవర్గంలో పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల కోసం పనిచేయడం మానేసి కూటమి నేతల సేవలో నిమగ్నమవుతున్నారు. వివరాల్లోకి వెళితే.. టీడీపీ దర్శి ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి జన్మదినం సందర్భంగా స్థానికంగా పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అయితే ఈ కార్యక్రమాలకు సీఐ తన సిబ్బంతో కలిసి లక్ష్మీకి కాన్వాయ్ ఏర్పాటు చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ కార్యక్రమం కాకపోయినా పోలీసులు అత్యుత్సాహం చూపించారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు అవన్నీ వదిలేసి కూటమి నేతల సేవలో నిమగ్నం కావడం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



గొట్టిపాటి లక్ష్మి కారు ముందు పోలీస్ కాన్వాయ్ నిర్వహిస్తున్న సీఐ

హామీలు విస్మరించడం చంద్రబాబు నైజం

- కూటమి ప్రభుత్వంలో శాంతిభద్రతలు క్షీణించాయి
- హామీల అమలు చేయడంలో చంద్రబాబు విఫలం
- ప్రజల తలరాతలు మారాలంటే జగనన్న రావాలి
- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్



బోగనంపాడులో మాట్లాడుతున్న ఆదిమూలపు సురేష్

పొన్నలూరు: ప్రజల తలరాతలు మారాలంటే మరోసారి జగనన్న ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని బోగనంపాడు గ్రామంలో శనివారం రాత్రి జరిగిన అంకమ్మ తల్లి తిరునాళ్ల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల స్టేజీపై ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ పాలనలో రాష్ట్ర ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారన్నారు. ఒంటరిగా పోటీ చేసి గెలవలేని కూటమి నేతలు 2024 ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు అబద్ధపు వాగ్దానాలు, హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడావుతున్న రాష్ట్ర ప్రజలకు ఒరిగింది శూన్యమన్నారు. మేలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను అమలు చేస్తానని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చిన చంద్రబాబు వాటిపై ఇప్పటి వరకు విధివిధానాలు ప్రకటించకపోవడం దారుణమన్నారు. ప్రతిసారి ఎన్నికల సమయంలో అలివికాని హామీలను గుప్పించి గెలిచిన తర్వాత వాటిని గాలికి వదిలేయడం చంద్రబాబు నైజమన్నారు. రాష్ట్రంలో రూపాయికి ఇడ్లీ దొరకటం లేదు కానీ చంద్రబాబు తన అనుమాయులకు 99 పైసలకే కోట్ల కొద్ది విలువ చేసే ప్రభుత్వ భూములను కట్టబెట్టి దోచుకుంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను, హామీలను ప్రశ్నించిన వారిపై దాడులు, అక్రమ కేసులు బనాయిస్తూ సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నిర్వహిస్తూ సామాన్య, పేద ప్రజలను మద్యానికి బానిసలుగా చేస్తూ కూటమి నేతలు జేబులు నింపుకుంటున్నారని దుయ్యబట్టారు. గ్రామాల్లో ఇసుక, మట్టి, మద్యం మాఫియాలుగా కూటమి నేతలు తయారై సహజ వనరులను కొల్లగొడుతున్నారన్నారు. గత ఏడాదిగా రాష్ట్రంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు, మద్దతు ధరలు లేక అల్లాడుతూ రోడ్డున పడి ధర్నాలు చేస్తుంటే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. రాష్ట్రంలో రైతులు, నిరుపేదలు, నిరుద్యోగులు, అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలంటే రాష్ట్రంలో మరోసారి వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుద్దుగుంట మల్లికార్జునరెడ్డి, నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, పిల్లి తిరుపతి రెడ్డి, దరిమడుగు కొండలరావు, మార్తాల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సివిల్ ర్యాంకర్లకు సన్మానం

కనిగిరిరూరల్: సివిల్స్‌లో ర్యాంకులు సాధించిన వారిని ఆదివారం స్థానిక అర్బన్ కాలనీలోని ఏటీఆర్ గార్డెన్‌లో ఐటీసీఎస్ఏ ఆధ్వర్యంలో ఐపీఎస్ ఆవుల రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. జిల్లాకు చెందిన ముగ్గురు సివిల్ ర్యాంకర్లు కౌసిక్ నరసింహ, ఉదయ్ కృష్ణారెడ్డి, సంగవరపు సాయి భార్గవ్‌లను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ, ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ గఫార్, ఐపీఎస్ ఆవుల తిరుపతి రెడ్డి ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన ఆవుల రమేష్ అధ్యక్షతన కార్యక్రమంలో బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ చదువులో అలుపెరగకుండా లక్ష్యాన్ని సాధించిన జిల్లాకు చెందిన ముగ్గురు సివిల్ ర్యాంకర్లు ఎందరికో దిక్సూచి అన్నారు. రాజకీయ వత్తిళ్లకు గురి కాకుండా ఏ లక్ష్యం, ఏ ఆశయంతో మీరు ఉన్నత స్థానాన్ని సాధించారో దాన్ని చివరి వరకు కొనసాగించాలని ఆకాంక్షించారు. విధి నిర్వహణలో దేశ, ప్రజా సేవల్లో నీతి, నిజాయితీ, నిబద్ధతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఐపీఎస్ ఆవుల రమేష్ రెడ్డి మాట్లాడుతూ ఎంత స్థాయి ఎదిగినా, ఏ హోదాలో ఉన్నా సొంత ప్రాంత అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఐటీసీఎస్ఏ ఆధ్వర్యంలో ఉన్నత విద్యా లక్ష్య సాధనలో ముందుకు సాగే విద్యార్థులకు ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏటా విజేతలకు ప్రోత్సాహక, అభినందన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్, మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి తదితరులు మాట్లాడారు. తొలుత ముగ్గురు సివిల్ ర్యాంకర్లు మాట్లాడుతూ తాము పడ్డ కష్టాలను.. ఇబ్బందుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఐటీసీఎస్ఏ నిర్వాహకులు, ఎస్‌కే జైలాబ్దిన్‌బాషా, ఎన్జీఓ సంఘ అధ్యక్షుడు పిల్లి వెంకట రమణారెడ్డి, జైలాబ్దిన్, జెడ్పీటీసీల సంఘం అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, మూలే రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.



సివిల్ ర్యాంకర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఐపీఎస్ ఆవుల రమేష్‌రెడ్డి, దద్దాల నారాయణ తదితరులు